సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

అధినేతను కలిసిన నాగిరెడ్డి



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో నాగిరెడ్డి తదితరులు

గాజువాక: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్ తిప్పల నాగిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వెంట నాయకులు జీలకర్ర నాగేంద్ర, 87వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొడ్డ గోవింద్, పిన్నింటి సంతోష్ తదితరులున్నారు.

క్రీడల్లో రాణిస్తే గుర్తింపు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వెంకటరమణారెడ్డి

పెదగంట్యాడ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా శ్రద్ధ చూపాలని కోరాడ గ్రామ నాయకుడు గొందేశి వెంకటరమణారెడ్డి సూచించారు. జీవీఎంసీ 75వ వార్డు పెద కోరాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఇటీవల క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు కోరాడ కనకారావు ఆర్థిక సాయంతో బుధవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జ్యోతి, బస పేర్రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు నీలిమ, అరుణ కుమారి, దేవి, మధుసూదన్‌రెడ్డి, వెంకటరావు పాల్గొన్నారు.


నిందితులను కఠినంగా శిక్షించాలి



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కార్మికులు

అక్కిరెడ్డిపాలెం: కోల్ కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ భెల్ (హెచ్‌పీవీపీ) సీఐటీయూ సంఘం కార్మిక సంఘ ప్రతినిధులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సంస్థలో బుధవారం చేపట్టిన కార్యక్రమంలో సీఐటీయూ ప్రధానకార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ అమానవీయ ఘటనపై పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుందన్నారు. దోషులు ఎంతటివారైనా కఠినంగా శిక్షలు పడేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్.జగన్నాధరావు, ఎస్.అప్పారావు, పి.కనకారావు,జి.అచ్చిన్నాయుడు, కె.కేశ్య, ఆర్.జనార్దనరావు, కె.నారపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ తీర్పును పునః సమీక్షించాలి



కూర్మన్నపాలెం కూడలిలో ధర్నా చేస్తున్న దళిత సంఘాల నేతలు

అగనంపూడి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాలని కూర్మన్నపాలెం కూడలిలో దళిత సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాటూరి శ్రీనివాసరావు, కేబీఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని 341 ఆర్టికల్ ప్రకారం మూడింట రెండొంతుల మెజార్టీతో పార్లమెంట్‌లో ఆమోదం పొందితే తప్పా ఆ తీర్పు చెల్లదన్నారు. కార్యక్రమంలో బూల జగజ్జీవన్‌రామ్, పాల్తేటి పెంటారావు, బూసి వెంకటరావు, బి.వి.స్వామి, గాలి ఆనంద్, నందికోళ్ల అప్పారావు పాల్గొన్నారు.



రోడ్డు విస్తరణ కలేనా!

- రోడ్డెక్కిన వ్యాపారాలు
- గ్రీన్‌బెల్ట్‌లో అక్రమ నిర్మాణాలు
- అమలుకు నోచుకోని రోడ్డు విస్తరణ ప్రతిపాదన
- అక్కిరెడ్డిపాలెం వాసులకు తప్పని తిప్పలు



గ్రీన్ బెల్టు ఆక్రమించి ముందుకు వచ్చిన నిర్మాణాలు



శిథిలమైన హైవేకు వెళ్లే మార్గం.. ముందుకు వచ్చిన దుకాణాలు

అక్కిరెడ్డిపాలెం: ఆ గ్రామానికి ఆక్రమణలు తలనొప్పిగా మారాయి. ఇష్టాను సారంగా ఇళ్ల నిర్మించడంతో పాటు వ్యాపారాలు రోడ్డెక్కాయి. మరో వైపు గ్రామ జనాభా పెరిగింది. దీంతో నిత్యం వేలాదిగా ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోలు రాకపోకలు సాగిస్తున్నాయి. వాటికి తగ్గట్టుగా రోడ్డు విశాలంగా లేక పోవడంతో ట్రాఫిక్ సమస్యలు నిత్యకృత్యమయ్యాయి.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో మూడు ప్రైవేట్ స్కూల్స్‌తో పాటు ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ హై స్కూల్ ఉన్నాయి. నిత్యం విద్యార్థులతో రోడ్డు కిక్కిరిసి పోతుంది. దీనికి తోడు ప్రధాన రోడ్డు పక్కనున్న గ్రీన్ బెల్టు ఆక్రమణతో సమస్య మరింత జఠిలంగా మారింది. ప్రధాన రహదారితో పాటు జాతీయ రహదారికి వెళ్లే రోడ్డులో ఆక్రమణలు, రోడ్డు పైకి వచ్చి వ్యాపారాలు సాగిస్తుండటంతో ఈ పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి గ్రామంలో ప్రవేశించే మార్గంలో ప్రయాణం నరక ప్రాయంగా ఉంటుందని వాహన చోదకులు వాపోతున్నారు.

తాకిడికి కారణాలివే



గ్రీన్ బెల్టు ఆక్రమించి ముందుకు వచ్చిన భవన నిర్మాణాలు

గ్రామంలో నిర్మాణాలు ఇష్టానుసారంగా చేపట్టడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. మరో వైపు గ్రీన్ బెల్ట్ స్థలాల్లో వ్యాపార సముదాయాలు నిర్వహించడంతో వచ్చే కొనుగోలు దారులతో రోడ్డు రద్దీగా మారుతుంది. ఫలితంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

నిత్యం తిప్పలే..

నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొనడంతో కొద్ది రోజుల కిందట రోడ్డు విస్తరణకు డిజిటల్ సర్వే చేపట్టారు. అయితే తర్వాత ఎలాంటి ముందడుగు పడలేదు. గ్రామస్తులు మాత్రం గ్రీన్ బెల్టులో ఆక్రమణలు తొలగించి రోడ్డు విస్తరించాలని కోరుతున్నారు.

ఇటు వైపు రాని అధికారులు...

గతంలో జీవీఎంసీ కమిషనర్‌గా ఉన్న సృజన రోడ్డు ఆక్రమణలపై ఉక్కుపాదం మోపారు. ఆమె వెళ్లి పోయిన తర్వాత జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం ఉందో లేదో తెలియని పరిస్థితి ఉంది. జీవీఎంసీ ప్రధాన కమిషనర్ అక్కిరెడ్డిపాలెంలో పర్యటించి సమస్యకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిష్టాత్మకంగా ఉపాధ్యాయ దినోత్సవం



మాట్లాడుతున్న భాస్కరరావు

గాజువాక: వచ్చేనెల 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామని గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (జిప్సా) అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు పేర్కొన్నారు. దీనికి పాఠశాలల యాజమాన్యాలు సహకరించాలని కోరారు. పాతగాజువాకలో బుధవారం నిర్వహించిన అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అసోసియేషన్ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న వారిలో కొంతమంది సీనియర్ సభ్యులను ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా సత్కరించుకుందామని కోరారు. సత్కారం కోసం ఎంపిక చేయడానికి నలుగురు సభ్యులతో కమిటీ వేసినట్టు తెలిపారు. కాగా, రెండేళ్లకోసారి నిర్వహించనున్న జిప్సా కార్యవర్గ ఎన్నికలను సెప్టెంబర్‌లో నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిప్సా ప్రతినిధులు బి.శ్రీనివాస్, రమేష్ నాయుడు, ఆర్.శోభన్‌బాబు, ఎం.జగ్గారావు, పి.మురళీ సుందర్, మౌళి, వాసుదేవరావు, సత్యనారాయణ, రవికుమార్, వెంకటరావు, వెంకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్



గృహ నిర్మాణాలపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

పెదగంట్యాడ: గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఇప్పటి వరకూ గ్రౌండ్ కాని గృహాలపై దృష్టి పెట్టాలని సూచించారు. పెదగంట్యాడ మండలం నడుపూరులోని 160 ఎకరాల్లో చేపట్టిన గృహాల లేఅవుట్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ దశలో ఉన్న గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోజూ పురోగతి ఉండాలని.. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. నడుపూరు లేఅవుట్‌లో 6216 గృహాలను మంజూరు చేయగా 403 ఇళ్ల పనులు ఇప్పటి వరకూ చేపట్టకపోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో ఇంజినీరింగ్ అధికారులు సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకొని ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ సత్యనారాయణ, పెదగంట్యాడ మండల తహసీల్దార్ లోకవరపు రామారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గ్రామపెద్దలు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలస శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వరసిద్ధి వినాయక పంచమరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. శ్రీ ఆదర్శ హనుమాన్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్టు కమిటీ ప్రతినిధులు బలిరెడ్డి శ్రీను,సత్యనారాయణ, బుదిరెడ్డి అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో కరణం సన్యాసిరావు, రాజు, పైడిరాజు పాల్గొన్నారు

ఆర్థిక ఆంక్షలు విధిస్తే అంగీకరించబోం

- స్పష్టం చేసిన ఉక్కు కార్మిక సంఘాల నేతలు



స్టీల్‌ప్లాంట్‌లో కార్మికుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఉక్కునగరం: కార్మికులపై ఆర్థిక ఆంక్షలు విధించాలని చూస్తే అంగీకరించబోమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. పోరాట కమిటీ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం ప్లాంట్‌లోని అన్ని విభాగాల్లో పర్యటించి కార్మికులతో సమావేశాలు నిర్వహించారు. ప్రస్తుత ప్లాంట్ పరిస్థితిని కార్మికులకు వివరించారు. యాజమాన్యం ముడి పదార్థాలు ఏర్పాటు చేయలేక కార్మికులపై ఆంక్షలు విధిస్తుందన్నారు. అటు ప్రభుత్వం, ఇటు యాజమాన్యాలు ప్లాంట్ పూర్తి ఉత్పత్తి తీయకుండా అడ్డుకుంటున్నాయని వివరించారు. స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో యాజమాన్యం నడిపితే కచ్చితంగా లాభాలు సాధిస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసి నిర్వాసితులందరికీ న్యాయం చేయాలన్నారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులకు వెంటనే వేతన ఒప్పందం చేయాలన్నారు. ఈ డిమాండ్లపై గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు కె.ఎస్.ఎన్. రావు, జె.అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, యు. రామస్వామి, నరేష్‌కుమార్, సురేష్‌బాబు, కొమ్ము ప్రసాద్, పి.వి. రమణమూర్తి, బి. డేవిడ్, బి. అప్పారావు, వై.టి. దాస్, కాంద్రేగుల శ్రీనివాసనాయుడు, మంత్రి గోపినారాయణ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు బుగ్గి

- గాజువాకలో కదం తొక్కిన విద్యార్థులు



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

గాజువాక: మాదక ద్రవ్యాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ గాజువాకలో విద్యార్థులు కదం తొక్కారు. స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో బుధవారం భారీ సంఖ్యలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పాతగాజువాక జంక్షన్ నుంచి బయల్దేరిన ర్యాలీ సినిమా హాల్ జంక్షన్ మీదుగా కొత్తగాజువాక జంక్షన్ వరకు కొనసాగింది. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వాలు గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ మధ్య కాలంలో యువత వ్యసనాలకు బానిసలుగా మారి అనేక నేరాలకు పాల్పడుతోందన్నారు. మహిళలపై దాడులు పెరిగాయన్నారు. మహిళలకు పని ప్రదేశాల్లో రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కోల్‌కతాలోని వైద్య విద్యార్థి హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.రాము, ఎల్‌జీ నాయుడు, నాయకులు సాయి, గుణ, కుసుమ, మౌని, అజయ్, నిఖిల్, సతీష్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి



స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీతకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని ఉక్కు నిర్వాసిత సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీతకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ కార్డుదారుల సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. ఇప్పటికే సుమారు 7వేల వరకూ నిర్వాసితులు ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ అధికారులతో చర్చలు జరిపి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌డీసీని కలిసిన వారిలో నిర్వాసితుల సంఘం నాయకులు పులి వెంకటరమణారెడ్డి, గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి పులి అప్పలరెడ్డి, ఎల్లేటి శ్రీనివాసరావు ఉన్నారు.

ఉక్కు సమస్యలపై మంత్రికి వినతి



మంత్రి రవీంద్రను కలిసిన వివిధ కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో సమస్యల పరిష్కారానికి సహకరించాలని పలు కార్మిక సంఘాల నాయకులు రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను కోరారు. బుధవారం స్టీల్‌ప్లాంట్ పర్యటనకు వచ్చిన మంత్రిని ఐఎన్‌టీయూసీ నాయకులు కలిసి సమస్యలను వివరించారు. స్టీల్‌ప్లాంట్‌కు ప్రస్తుతం ముడి పదార్థాలు లేకపోవడం వల్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయిందన్నారు. అదే విధంగా నగదు నిల్వలు లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. ఇటీవల ప్లాంట్‌కు గర్భాం మాంగనీస్ గనుల లీజు పునరుద్ధరించినట్టే సారిపల్లి ఇసుక లీజు పునరుద్ధరించాలని, ఓబులాపురం గనులను స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, జి.వి. సుబ్బయ్య, కూటమి నాయకులు గుమ్మడి నరేంద్ర, నమ్మి సింహాద్రి, ఎం. రఘుప్రసాద్, సీహెచ్. శ్రీనివారావు, కొల్లి శివనాగేశ్వరరావు, బీఎంఎస్ ప్రధానకార్యదర్శి కొమ్మినేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు సత్కారం



సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

అగనంపూడి: విద్యార్థులతో పాటు గ్రామస్తుల మన్ననలు పొందే ఉపాధ్యాయులు ఉత్తమ గురువులని, అటువంటి ఆనందం చెప్పలేనిదని లంకెలపాలెం,పెదముషిడివాడ పాఠశాలల సముదాయాల ప్రధానోపాధ్యాయులు రౌతు నాగేశ్వరరావు, కృష్ణ అన్నారు. పదవీ విరమణ పొందిన అచ్యుతాపురం హైస్కూల్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు బుడుమూరు శ్రీనివాసరావు, వాడచీపురుపల్లి పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు బెహరా వెంకటరమణ పాత్రుడు, లేమర్తి హైస్కూల్ సోషల్ అసిస్టెంట్ ఆనంద్, హరిపాలెం ఉపాధ్యాయుడు తేజో వెంకటేష్‌లను బుధవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ అనకాపల్లి అధ్యక్షుడు పెద్దినాయుడు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు జి.శ్రీరామూర్తి, కల్యాణరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పెదగంట్యాడ: టింపనీ 11కేవీ ఫీడర్, గాంధీనగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేయనున్న నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయకుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టింపనీ 11కేవీ ఫీడర్ పరిధిలోని ప్రగతి పార్కు ఏరియా, టింపనీ స్కూల్ ఏరియా, వుడా కాలనీ ఫేజ్-2, భరత్‌నగర్, అమరావతినగర్ ఏరియాతో పాటు గాంధీనగర్ ఫీడర్ పరిధిలో సమతానగర్, చిన నడుపూరు, పెదనడుపూరు, వెంపళ్లనగర్, శీకువానిపాలెం, సిద్ధేశ్వరం తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అక్కిరెడ్డిపాలెం ప్రాంతంలో..

అక్కిరెడ్డిపాలెం: 11 కేవీ కణితి రోడ్డు, 11 కేవీ ఎస్‌టీపీ వాటర్ వర్క్స్ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని జోన్ – 2 ఈఈ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. షీలానగర్ ఐకాన్ డిజిటల్ ఎగ్జామినేషన్ సెంటర్, కిమ్స్ ఐకాన్ రోడ్డు ఏరియా, ఎంబీఆర్ ల్యాండ్ అండ్ విశాల్ మార్ట్ హెచ్‌టీ, జీవీఎంసీ వాటర్ వర్క్స్, నవ్య న్యూ లైఫ్ అపార్ట్‌మెంట్, హెరిటేజ్ బిల్డింగ్ అండ్ సిగ్నేచర్ టవర్స్, పంతులుగారి మేడ ఏరియా, పద్మజ హాస్పటల్, చిట్టినాయుడు కాలనీ, దశమికొండ, ఆటోనగర్ జంక్షన్, కెనరాబ్యాంకు ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

చినగంట్యాడ పరిధిలో..

గాజువాక: చినగంట్యాడ విద్యుత్ సబ్ స్టేషన్‌లోని చినగంట్యాడ 11కేవీ ఫీడర్‌లో శుక్రవారం నిర్వహణ పనులను చేపట్టనున్నట్టు ఈపీడీసీఎల్ జోన్-2 డీఈ బీకే నాయుడు తెలిపారు. ఈ కారణంగా స్నేహపురి కాలనీ, ఎస్సీ కాలనీ, కోర్టు ఏరియా, చినగంట్యాడ ప్రాంతాలకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంటన్నర వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు

అగనంపూడి: ఉపాధ్యాయుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు అన్నారు. లంకెలపాలెం హైస్కూల్ ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యలు ఒక్కొక్కటి పరిష్కరించేందుకు తనవద్ద ప్రణాళిక ఉందన్నారు. ముఖ్యమంత్రిని కలిసి సమస్యలు, వాటి పరిష్కార మార్గాలను కూడా సూచించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ కోఆర్డినేటర్లు రాణి, రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను వినియోగించుకోండి



శిక్షణ పూర్తి చేసుకున్న యువతతో సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్ట్ హెడ్ సిన్హా, అధికారులు

పరవాడ: యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్ట్ హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా సూచించారు. సంస్థ సీఎస్సార్ విభాగం ఆధ్వర్యంలో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్, టెక్నాలజీ(సీఐపీఈటీ, విజయవాడ) సహకారంతో 4వ బ్యాచ్ స్కిల్ డెవలప్‌మెంట్ విజయోత్సవ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సిన్హా మాట్లాడుతూ సీఎస్సార్ కార్యక్రమాల ద్వారా సమాజ సంక్షేమానికి సింహాద్రి ఎన్టీపీసీ విశేష కృషి చేస్తోందన్నారు. నిరుద్యోగ యువతకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం, వివిధ సంస్థల్లో వారికి ఉపాధి అవకాశాలు కల్పించడానికి సంస్థ పాటుపడుతోందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో ఒక్కో బ్యాచ్‌లో 30 మంది అభ్యర్థులకు 6 నెలల పాటు మెషిన్ ఆపరేటర్స్-ఇంజెక్షన్ మోల్డింగ్, మోఫిన్ ఆపరేటర్స్-ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు సిన్హా చెప్పారు. కార్యక్రమంలో సీజీఎం(సీపీజీ-3) ఆర్.ఆర్. పరిధా, జీఎం నోవాహు గద్దం, సంస్థ అధికారులు పద్మప్రియ, అనిత్‌కుమార్, శ్రీమంత మహాపాత్ర, కె.ప్రకాశరావు, శివం ప్రతాప్‌సింగ్, డాక్టర్ సిహెచ్.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివిధ కోర్సుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీచేయడానికి గెస్ట్ లెక్చరర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.వి.ఎస్.మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ బయోడేటాతో నేరుగా కళాశాలకు వచ్చి గురువారం అందజేయాలన్నారు. సంబంధిత సబ్జెక్టు పీజీ కోర్సుల్లో 50 శాతానికి పైగా మార్కులు సాధించాలని చెప్పారు. జనరల్ సబ్జెక్టుల్లో కామర్స్ విభాగంలో ఒక పోస్టు, పౌరశాస్త్ర విభాగంలో ఒక పోస్టు భర్తీ చేయనున్నట్లు తెలిపారు.